
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.8

ANDHRAJYOTHY



బంగారం తాపడం పనులు షురూ

● రాగిరేకులను చెన్నైకు తరలించిన అధికారులు

● బంగారం తాపడంకోసం రూ.3.90కోట్లు ఖర్చు

7



విమానగోపురానికి బంగారం తాపడం కోసం చైన్నెకి తరలిస్తున్న రాగిరేకులు



భూదందా కేసులో.. అరెస్టుల పర్వం

హుజూర్‌నగర్ మండలంలో ప్రభుత్వ భూమిని అక్రమంగా బదలాయించిన వ్యవహారంలో అరెస్టులు కొనసాగుతున్నాయి. మూడు రోజుల కిందట ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం ఉదయం ఇదే కేసులో గత తహసీల్దార్ వజ్రాల జయశ్రీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో భూదందాలో ఇప్పటికి ఇద్దరు జైలుపాలుగా కాగా ఈ అక్రమాలతో ముడిపడిన వ్యక్తుల్లో భయాందోళన మొదలైంది. జయశ్రీ తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో 500 ఎకరాలకు పైగానే అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా జయశ్రీ అరెస్టుపై పోలీసులు చివరి వరకు మీడియాకు తెలియకుండా గోపత్య పాటించారు.

– హుజూర్‌నగర్

- హుజూర్‌నగర్ గత తహసీల్దార్ జయశ్రీ అరెస్టు, రిమాండ్
- ఇప్పటికే రిమాండ్‌లో ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్
- జయశ్రీ అరెస్ట్‌పై గోప్యత పాటించిన పోలీసులు
- అక్రమార్కుల్లో మొదలైన భయాందోళన
- వేగంగా చర్యలకు తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులు

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలోని వివిధ సర్వే నెంబర్లలోని ప్రభుత్వభూమి 36.23ఎకరాల అక్రమబదలాయింపులో వేగంగా చర్యలు మొదలయ్యాయి. దీంతో జయశ్రీ సమయంలో అక్రమంగా పట్టాలు చేయించుకున్న వారిలో భయాందోళనలు మొదలైంది. హుజూర్‌నగర్ మండలంలో, మునిసిపాలిటీలో సుమారు 500 ఎకరాల పైనే ప్రభుత్వ భూములకు ప్రైవేట్ వ్యక్తులు డిజిటల్ పట్టాలు చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నెల రోజుల వ్యవధిలోనే

ప్రభుత్వ భూమి అక్రమబదలాయింపుపై వేగంగా చర్యలు కొనసాగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో రెం డు పర్యాయాలు విచారణతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తహసీల్దార్ అరెస్టు వరకు వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. సెప్టెంబరు 10న బూ రుగడ్డకు చెందిన కొంతమంది కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు భూ అక్రమ రిజిస్ట్రేషన్లపై ఫిర్యాదు చేశారు. దీనిపై హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు విచారణ కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఆయన నివేదిక ఆధారంగా అదే నెల 21న సమగ్ర విచారణ కోసం అదనపు కలెక్టర్ లతను విచారణాధికారిగా కలెక్టర్ నియమించారు. ఆమె విచారణ జరిపి నివేదికను అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా ఆర్డీవో ఫిర్యాదు మేరకు ఈ నెల 5వ తేదీన ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ జయశ్రీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంతా నెల రోజుల్లోనే పూర్తయ్యింది.

అధికారి సమాచారంతోనూ

ఇదిలాఉండగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఓ రెవెన్యూ అధికారిపై భూఅక్రమాలకు సంబంధించి ఆరోపణలు వచ్చాయి. అయన్ను జిల్లా ఉన్నతాధికారులు విచారిస్తున్న సమయంలో హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో అవినీతి, అక్రమాలను వెల్లడించినట్లు సమాచారం. ఈ క్రమంలో పలు విచారణల అనంతరం మొదటగా ధరణి ఆపరేటర్ జగదీష్‌ను డిస్మిస్ చేశారు. ఇదిలా ఉండగా అరెస్టులను అడ్డుకునేందుకు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. హైకోర్టు స్టేకు నిరాకరించడంతో అధికార పార్టీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేల ద్వారా కేసు నీరుగార్చే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కానీ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సీరియస్ కావడంతో రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులు కేసును వేగంగా విచారణ చేసినట్లు తెలిసింది. అధికార పార్టీ ఎమ్మెల్యేల అభ్యర్థనలను పట్టించుకోలేదు.



జగదీష్ కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వ భూమి ఇదే

అక్రమ పట్టా వివరాలు

బూరుగడ్డ గ్రామంలో 439 సర్వేనెంబర్‌లో 164 ఎకరాల 12 గుంటల భూమి, 604 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల భూమి ఉంది. అతిపెద్ద సర్వేనెంబర్లు కావడంతో ప్రభుత్వ మిగులు భూమి అధికంగా ఉంది. వీటితో పాటుగా 602, 608, 1041 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉండగా వాటన్నింటిని ధరణి ఆపరేటర్ కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టర్‌లో నమోదు చేశారు.

- 439/55/5లో విస్తీర్ణం 8.38 ఎకరాలు, 604/116లో 7.32 ఎకరాలు మొత్తంగా పచ్చిపాల ప్రియాంక పేరు మీద 16.30 ఎకరాలు నమోదు చేశారు.
- సర్వే నెంబర్ 604/58లో 4.38 ఎరాలు మడిపల్లి స్వప్న(జగదీష్ సోదరి) పేరు మీద నమోదుచేశారు.
- హుజూర్‌నగర్‌లోని 602/102/1లో 0.01 గుంటలు, 608/16లో 8.0 ఎకరాలు, 1041/144లో 6.25 ఎకరాలు, 1041/368/3/2/5 లో 0.10 గుంటలు, మరోచోట 1.19 ఎకరాలు జగదీష్ తల్లి వత్సవాయి ఇందిర పేరు మీద నమోదు చేశారు. మొత్తంగా 36.23 ఎకరాలను అక్రమంగా బదలాయించారు. ఈ వ్యవహారమంతా తహసీల్దార్‌గా జయశ్రీ 2019 నుంచి ఫిబ్రవరి 2023 మధ్య పనిచేసిన కాలంలో జరిగినట్లు గుర్తించారు.
- బూరుగడ్డలో ఒక్కో ఎకరం రూ.50 లక్షలకు పైగా ధర పలుకుతోంది. అక్రమాలు చోటుచేసుకున్న భూమి విలువ రూ.18 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.
- అక్రమంగా బదలాయించిన భూమికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రైతు బంధు రూ.14,63,000లను తహసీల్దార్, ధరణి ఆపరేటర్ సగం, సగం పంచుకున్నారు.

అరెస్టుపై గోప్యత...

భూదందా కేసులో మూడు రోజుల కిందట జగదీష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జయశ్రీ కొద్దిరోజులుగా సెలవులో ఉన్నారు. ఆమెను బుధవారం ఉదయం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ జయశ్రీకి 14 రోజుల రిమాండ్ విధించటంతో ఆమెను హుజూర్‌నగర్ సబ్ జైలుకు తరలించినట్లు సీఐ చరమంద రాజు తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి తహసీల్దార్‌ను 220బీ, 406, 409, 420, 467, 468 సెక్షన్ల కింద ఆమెపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా చిన్నచిన్న దొంగతనాల కేసుల్లోనే నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టే పోలీసులు తహసీల్దార్ అరెస్ట్, రిమాండ్ విషయంలో గోప్యత పాటించారు. కేవలం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో వాట్సాప్ గ్రూప్‌లో ప్రకటన విడుదలకు పరిమితం చేశారు.



సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు



ఒప్పందపత్రాలను చూపుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పవర్ గ్రిడ్ సీఎండీ అరుణ్‌కుమార్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 9 : పవర్ గ్రిడ్ ద్వారా అందించిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులతో జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ కింద పవర్ గ్రిడ్ నుంచి మంజూరైన రూ.1.50కోట్ల నిధులకు సంబంధించిన ఒప్పందాలపై బుధవారం కలెక్టరేట్‌లో పవర్ గ్రిడ్ సీఎండీ అరుణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీవో కిషన్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ బదిలీల్లో
పైరవీల జోరు

భానుపురి, అక్టోబరు 9: విద్యుత్ శాఖ బదిలీల ప్రక్రియలో పైరవీలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బదిలీపై యూనియన్ల నాయకులకు, అధికారులకు మధ్య చర్చలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అనుకూలంగా కేటాయింపులు జరగకపోతే బాగుండదని కొందరూ బహిరంగంగానే విమర్శిస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలనే నిబంధనను తుంగలో తొక్కేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఆరు నుంచి ఏడేళ్ల ఒకేచోట పనిచేస్తున్న జేఏవోలను సూర్యాపేట సర్కిల్ నుంచి ఎందుకు బదిలీ చేయడం లేదని యూనియన్ నాయకులు ప్రశ్నిస్తున్నా, కొంతమంది అధికారులు వెనుకేసుకొస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్వీపర్లు, జేఎల్ఎంలు, లైన్‌మన్ల బదిలీలు డివిజన్ ఇంజనీర్ల ద్వారా బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఎస్ఈ పరిధిలో జేఏవోలు, యూడీసీ(సీనియర్ అసిస్టెంట్లు), జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. ఏడీఈల బదిలీను ఉన్నతాధికారులు చేపడుతున్నారు. అయితే సూర్యాపేట సర్కిల్‌లో పనిచేసే జేఏవోలకు మూడుసార్లు బదిలీ ప్రక్రియ పూర్తి చేసినా బదిలీ కాకుండా అక్కడే తిష్ఠ వేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులకు అనుకూలంగా పనులు చేస్తుండడంతో బదిలీలు కాలేదని విమర్శలుఉన్నాయి. ఈసారి బదిలీలు కాకపోతే సిబ్బంది పెద్దఎత్తున ధర్నా చేసే అవకాశాలు ఉన్నాయని పలువురు గుసగుసలాడుతున్నారు. గురువారం అన్నిస్థాయిల ఉద్యోగులకు బదిలీ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉండడంతో బుధవారం పైరవీలు జోరందుకున్నాయి.

బదిలీలు పారదర్శకంగా ఉంటాయి

బదిలీలు పారదర్శకంగా ఉంటాయి. పైరవీలకు తావులేదు. సర్కిల్ కార్యాలయంలో నిబంధనల ప్రకారం బదిలీ అవుతారు. శాఖలో పైరవీలకు, అవినీతికి తావులేదు.

– ఫ్రాంక్లిన్, సూర్యాపేట విద్యుత్ శాఖ ఎస్ఈ

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలుచేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట టౌన్, అక్టోబరు 9 : ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి సోమయ్య, జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ డిమాండ్‌చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించి, మాట్లాడారు. గత 30 ఏళ్ల కొట్లాడి సుప్రీంకోర్టు ద్వారా సాధించుకున్న హక్కులను రోజున సీఎం రేవంత్‌రెడ్డి న్యాయమైన తీర్పు అని దేశంలో నేనే ముందుగా రాష్ట్రంలో అమలు చేస్తానని నమ్మించారన్నారు. ప్రస్తుతం అన్ని ఉద్యోగాల నియామకాల్లో ఎలాంటి ఆర్డినెన్స్ లేకుండా నియామకాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయంతో మాదిగలకు, మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ వర్గీకరణ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ఖాశీం, ఎర్ర వీరస్వామి, చితం జాన్‌విల్సన్, వలపట్ల దయానంద్, వలపట్ల కృష్ణ, నకిరేకంటి రాము, బొజ్జ సైదులు, మారెపల్లి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ అరెస్టు సరికాదు

సూర్యాపేటఅర్బన్ : ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టకుండా ఉద్యోగ నియా మకాలను నిరసిస్తూ మందకృష్ణ మాదిగ చేపట్టిన నిరసన ర్యాలీని అడ్డుకొని అక్రమంగా ప్రభుత్వం అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు కనుకు రవి, వల్లపట్ల రవి పాల్గొన్నారు.

నేడు సద్దుల బతుకమ్మ

- నేటితో ముగియనున్న వేడుకలు
- గౌరమ్మకు సద్దుల సమర్పణ
- అనంతరం గంగమ్మ ఒడికి..
- ఏర్పాట్లు చేసిన అధికారులు





కలెక్టరేట్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడుతున్న మహిళలు

సూర్యాపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ వేడుకలకు జిల్లా ముస్తాబైంది. తొమ్మిది రోజుల వేడుకలో చివరి రోజైన గురువారం సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. నచ్చిన పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకను ఘనంగా జరుకునేందుకు మహిళలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా గౌరమ్మకు సత్తుపిండి, పెరుగన్నం, పులిహోర, మలిద ముద్దలు, కొబ్బరిఅన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. వేడుక అనంతరం బతుకమ్మను గంగమ్మ ఒడికి చేర్చుతారు. దీంతో ప్రతీ ప్రాంతం, చెరువులు కుంటలు పూలవనాలుగా మారనున్నాయి. సద్దుల వేడుకల కోసం స్థానిక సంస్థలతో పాటు పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. సూర్యాపేట పట్టణంలోని సద్దులచెరువు వద్ద లైట్ల ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. పలుచోట్ల బతుకమ్మ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నారు. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్తుండడంతో బస్టాండ్‌తో పాటు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీగా ఉంది.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

సూర్యాపేట(కలెక్టరేట్) : సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను సతీమణి తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బంది ఎప్పుడూ ఆడుతూ, పాడుతూ సంతోషంగా ఉండాలన్నారు. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమని ప్రకృతిలో లభించే పూలను సేకరించి అందంగా పేర్చి పూజలు చేసి చిన్నా, పెద్దా తేడా లేకుండా తొమ్మిది రోజుల పాటు పాటలు పాడుకుంటూ వేడుకలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, పవర్ గ్రిడ్ సీఎండీ అరుణ్‌కుమార్, డీఆర్‌డీవో అప్పారావు, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, అనసూర్య, లత, డీసీవో పద్మ, ఏవో సుదర్శన్‌రెడ్డి, పద్మారావు, టీఎన్‌జీవో నాయకులు దున్న శ్యాం పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుచేయాలి



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకులు

తుంగతుర్తి, అక్టోబరు 9 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తుంగతుర్తిలో ఏర్పాటు చేయాలంటూ తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మెయిన్‌రోడ్డుపై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తుంగతుర్తికి మంజూరైన వ్యవసాయ మార్కెట్ యార్డును తిరుమలగిరి తరలించారని, ఇప్పుడు మరోసారి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తొండ గ్రామానికి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించి ఈ నెల 11న తొండ తిరుమలగిరిలో నిర్వహించే శంకుస్థాపనను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు తడకమళ్ల రవికుమార్, గోపగాని శ్రీను, బొంకూరి మధు, మల్లేష్, నాగమల్లు, మల్లికార్జున్, సురేష్, భానుప్రకాష్, మధు, సాయికుమార్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

తిరుమలగిరి, అక్టోబరు 9 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు నేటి నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 10న దుర్గాష్టమి, సద్దుల బతుకమ్మ, 11న మహర్నవమి, 12 దసరా పండుగ, 13 ఆదివారం సెలవుగా ఆయన పేర్కొన్నారు. సెలవు దినాల్లో రైతులు మార్కెట్‌కు ఎలాంటి ఉత్పత్తులను తీసుకురావద్దని ఆయన తెలిపారు. 14వ తేదీ సోమవారం నుంచి మార్కెట్ యథావిధిగా కార్యకలాపాలు జరుగుతాయని ప్రకటనలో పేర్కొన్నారు.

వైభవంగా దేవీనవరాత్రోత్సవాలు



సూర్యాపేటలో దుర్గాదేవి వద్ద పూజా కార్యక్రమాల్లో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, అక్టోబరు 9 : దుర్గాదేవి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల అన్నదానాలు, హోమాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తున్నారు. దీక్ష చేపట్టిన భక్తులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. సూర్యాపేటలోని 36వ వార్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. రాష్ట్ర సంస్కృతీ, సంప్రదాయాలు ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సుభిక్షపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బొల్ల వెంకట్‌రెడ్డిడ, నాయకులు ఫరూఖ్, ప్రమోదా, జయశ్రీ, మురళీ, నాగయ్య, మహేష్, సాయి, సందీప్, వంశీ, సిద్ధు, మధు, కృష్ణ, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, దేవేందర్, పిల్లల రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయం, అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మొలుగు శ్రీనివాసశాస్త్రి, ఉగ్రదండి శివప్రసాద్ శర్మ ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించగా గతంలో ఎన్నడూ లేనివిధంగా చిన్నారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్, మార్కెట్ చైర్మన్లు బచ్చలకూరి ప్రకాష్, బెల్లంకొండ విజయలక్ష్మి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అలక సరిత, ఎస్ఐ రవీందర్, కమిటీ సభ్యులు కొణతం ఆదిరెడ్డి, కొణతం చినవెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, రాచకొండ రాంమోహన్‌రావు, కట్టా గణేష్, మానుకొండ మాధవరెడ్డి, కొణతం రాంరెడ్డి, పేరబోయిన వీరయ్య, ఆరె. కృష్ణారెడ్డి, పానుగోటి జంగయ్య, శంకర్‌రెడ్డి, రాచకొండ అజయ్, చిత్తనూరి సత్యనారాయణ, ఆకారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో అక్షరాభ్యాస పూజలో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

మూడు రోజుల్లోనే
ధాన్యం డబ్బులు జమ

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 9: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలో ధాన్యం విక్రయించిన డబ్బులు జమ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో గత సీజన్‌లో సైతం ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యాన్ని ప్రోత్సహించడంతో భాగంగా రూ.500బోనస్ ఇస్తోందని, గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాకు రూ.2320 మద్దతు ధర ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో 53శాతం సన్నాలు సాగవుతున్నాయన్నారు. పేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. రూ.500కే ఎల్‌పీజీ కనెక్షన్ ఇస్తున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ యంత్రం మరమ్మతుకు వస్తే అమెరికా నుంచి విడిభాగాన్ని తెప్పించామని, డిసెంబరులో పనులు మొదలు పెట్టి రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా అన్ని చెరువులకు సాగునీరు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం
ప్రాణం కాపాడిన పోలీసులు



పోలీసులతో వెంకటరాజు

శాలిగౌరారం, అక్టోబరు 9: భార్యతో గొడవ పడి ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేయబోయిన వ్యక్తిని కాపాడారు నల్లగొండ శాలిగౌరారం పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన సింహం వెంకటరాజు వంట పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారం రోజుల క్రితం వెంకటరాజు భార్యతో గొడవ పెట్టుకున్నారు. దీంతో భార్య ముగ్గురు పిల్లలను తీసుకొని తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన వెంకటరాజు చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ముందు నల్లగొండలో ఉంటున్న తన మిత్రుడైన వెంకటేశంకు ఉరి వేసుకుంటున్నట్లు వీడియో కాల్ చేశారు. 'మీరు ఉరి వేసుకోవద్దు.. నేను వచ్చి మాట్లాడుతా' అని చెప్పాడు. వెంటనే వెంకటేశం 100కాల్‌కు ఫోన్ చేశాడు. స్పందించిన శాలిగౌరారం కానిస్టేబుళ్లు వి. నాగయ్య, సతీష్ వెంటనే వెంకటరాజు ఇంటికి చేరుకున్నారు. వెంకటరాజు ఆ సమయంలో ఇంట్లో లేడు. ఇంకా కొద్ది క్షణంలో ఇంటికి చేరుకున్న వెంకటరాజు పోలీసులను చూసి ఫ్యానుకు ఉరివేసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు ఉరివేసుకోవద్దని వారించారు. 100కాల్ చేసిన వెంకటేశం వెంకటరాజు ఇంటికి చేరుకున్నాడు. స్నేహితుడు, పోలీసులు కలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. వెంకటరాజును వెంకటేష్‌తో నల్లగొండకు పంపించారు.

డీసీఎంలో తరలిస్తున్న ఆవుల పట్టివేత

కట్టంగూరు, అక్టోబరు 9: అనుమతి లేకుండా తరలిస్తున్న ఆవులను నల్లగొండ జిల్లా కట్టంగూరు పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎస్‌ఐ ఎం.రవీందర్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రెండు డీసీఎం వాహనాలను తనిఖీ చేయగా వాటిలో 22ఆవులు, 32 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ కొండ వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆనంద క్షణాలు..





తాము పడిన కష్టానికి ఫలితం లభించడంతో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రాలు అందుకునేందుకు వారు బుధవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల నుంచి బస్సుల్లో బయలుదేరారు.

యాదగిరీశుడి విమాన గోపురానికి బంగారు తాపడం పనులు షురూ

● రాగిరేకులను చెన్నైకు తరలించిన అధికారులు ● బంగారం తాపడం పనులకు రూ.3.90కోట్ల వ్యయం ● మొత్తం 60కిలోలతో స్వర్ణతాపడం



రాగిరేకులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఈవో భాస్కర్‌రావు


యాదాద్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలోని విమాన గోపురానికి బంగారు తాపడం పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బుధవారం మంచి ముహూర్తం ఉండటంతో గోపురంకోసం తయారు చేసిన దేవతల విగ్రహాలతో కూడిన రాగి రేకులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఈవో ఎ.భాస్కర్‌రావు, ఆలయ అధికారుల పర్యవేక్షణలో చెన్నైకు తరలించారు. 2025 మార్చిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉన్నందున, ఈ బంగారు తాపడం పనులు 2025 ఫిబ్రవరి వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ బంగారం తాపడం పని మొత్తం 10వేల చదరపు అడుగులు ఉంటుంది. చదరపు అడుగుకు రూ.3900 చొప్పున ప్రభుత్వం మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్‌కు అప్పగించింది. బంగారం తాపడం చేసేందుకు మొత్తం రూ.3.90కోట్లు ఖర్చు కానుంది. ఇదివరకే రాగి రేకుల పని పూర్తికావడంతో వీటికి బంగారం తాపడం చేపట్టి, విమాన గోపురానికి అమర్చనున్నారు. ఈ బంగారు తాపడం పనిని మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్, చెన్నైకు అప్పగించారు. ఈ సంస్థ దేవాలయానికి సంబంధించిన ధ్వజస్తంభం, గర్భాలయం ముఖద్వారం పనులు చేపట్టింది. బంగారు తాపడం కోసం మొత్తం 60 కిలోల బంగారం అవసరం కాగా... విరాళాల ద్వారా 10.5 కిలోల బంగారం, రూ.20కోట్ల మేరకు నగదు సమకూరింది. ఈ నగదుతో 26 కిలోల బంగారాన్ని కొనుగోలు చేయనున్నారు. దేవస్థానానికి సంబంధించిన 13 కిలోల గోల్డ్‌బాండ్స్ వాడుకోనున్నారు. దేవస్థానం వద్ద రెండు కిలోల బంగారం, 776 కిలోల వెండిని భక్తులు విరాళాల రూపంలో అందించారు. బంగారం తాపడంకోసం వీటిని కూడా వినియోగించుకోనున్నారు. భక్తుల విరాళాలను వినియోగించుకునేందుకు గత నెల (సెప్టెంబరు) 27న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 51.5కిలోల బంగారం సమకూరగా, మిగిలిన 8.5కిలోల బంగారం కోసం ఈ మేరకు భక్తులు, దాతల నుంచి విరివిగా విరాళాలు వసూలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

వార్షిక బ్రహ్మోత్సవాల వరకు తాపడం పనులు పూర్తి చేస్తాం : బీర్ల

భువనగిరి అర్బన్: వచ్చే సంవత్సరం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల వరకు దివ్య విమాన రాజగోపురం తాపడం పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరికొండపై స్వర్ణతాపడం పనుల కోసం విగ్రహాల తరలింపుకు ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తితో కలిసి ప్రత్యేక పూజలు చేసి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో నంబరు 100 విడుదల చేసిందని తెలిపారు.

సరస్వతి అలంకరణలో దుర్గాదేవి

భువనగిరి అర్బన్, అక్టోబరు 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆరు రోజులుగా పర్వతవర్ధిని అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సరస్వతీ దేవిగా అమ్మవారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశక్తి స్వరూపాల్లో మూడోశక్తి రూపం చదువుల తల్లి సరస్వతీ అమ్మవారి అవతారం. ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, మహా సరస్వతీ పూజ, గాయత్రి జపాలు, లలిత సహస్రనామార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అగ్ని ప్రతిష్ఠ, పూజ నీరాజన మంత్ర పుష్పాలు అర్పించిన అనంతరం సాయంత్రం శ్రీదేవి నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం, మంత్రపుష్పాలు, మహాసరస్వతీ స్వరూప సువాసినీ పూజ, కుమారి పూజల అనంతంర అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామివారి ప్రధానాలయంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో సహస్రనార్చనలు జరిపారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,34,164ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. అర్చకులు ఆలయంలో అర్చకులు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎన్. శ్రీనాథ్, ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 12మేకలు మృత్యువాత

● వాగులో కొట్టుకుపోయిన నాలుగు మేకలు ● కాపరులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

నేరేడుచర్ల, అక్టోబరు 9: పిడుగుపాటుకు గురై 12 మేకలు మృత్యువాత పడగా, మరో నాలుగు వాగులో కొట్టుకు పోయాయి. బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పులగంబండ తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూసొడ్డుతండాలో ఈ సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మూసొడ్డుతండాకు చెందిన బాణోతు బాలు, బాణోతు హేమ్లా, బాణోతు సైదా తమ 27 మేకలను బుధవారం ఉదయం పొలం సమీపంలోని వాగు వెంట మేపుతున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వర్షం రావడంతో అన్ని మేకలు సమీపంలోని చెట్ల కిందకు వెళ్లాయి. వర్షం కురుస్తుండడంతో మేకలు అటూ ఇటూ పరిగెత్తుతుండడంతో వాటిని బాలు, హేమ్లా ఆ మేకలను చెట్లకిందకు పంపుతున్నారు. ఆ సమయంలో పిడుగు పడడంతో ఒక్కసారిగా మేకలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. అందులో కొన్ని మేకలు వాగులో కొట్టుకుపోగా, 12 మేకలు మృత్యువాత పడ్డాయి. సమీపంలోనే ఉన్న గ్రామస్థులు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చారు. అప్పటికే బాలు, హేమ్లా కూడా పిడుగుశబ్దానికి కిందకు పడిపోయారు. వారు తేరుకొని లేచేసరికి మేకలు వాగులో కొట్టుకుపోతుండడంతో వాటిని రక్షించేందుకు వాగులోకి దిగారు. కొన్ని మేకలను రక్షించగా నాలుగు మేకలు కొట్టుకుపోయినట్లు బాధితులు తెలిపారు. బాణోతు బాలుకు చెందిన 10మేకలు, హేమ్లా, సైదాలకు చెందిన ఒక్కో మేక మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.2.50లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) నర్సయ్య సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు.



మూసొడ్డుతండాలో పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన మేకలు

మేళ్లచెర్వు: మేళ్లచెర్వు మండల పరిధిలో రేవూరు గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు ఆవు మృత్యువాత పడింది. మండల పరిధిలోని రేవూరు గ్రామానికి చెందిన జూనెబోయిన కొండలుకు చెందిన ఆవు మేతకు వెళ్లింది. పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు రూ.50వేల విలువ చేసే ఆవు మృతిచెందడంతో కొండలు కన్నీటి పర్యంతమయ్యారు.

తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక సర్దార్ పాపన్న

● శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

శాలిగౌరారం, అక్టోబరు 9: తెలంగాణ ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నిలిచారని తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం భైరవునిబండ గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పాపన్నగౌడ్ స్ఫూర్తితో బహుజన జాతి అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. పాపన్న గౌడ్ సబండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం కృషి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పోరాడిన మహోన్నత వ్యక్తి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పల్లె రవికుమార్, పంజాల జైహింద్‌గౌడ్, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్, చెరుకు సుధాకర్ గౌడ్, డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, మారుపెద్ది శ్రీనివాస్ గౌడ్, మేకపోతుల నరేందర్, అయితగోని వెంకన్న, ఈదులకంటి యాదయ్యగౌడ్, గుజలాల్ శేఖర్ బాబు, కమ్మంపాటి శంకర్ గౌడ్, ఈదులకంటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్ అక్టోబరు 9: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన బాసరాజు నర్సింహ(62) కొంత కాలంగా పక్షవాతంలో బాధపడుతున్నాడు. ఇంట్లో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. నర్సింహ ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు.

స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

మునగాల, అక్టోబరు 9: వీధిలైట్లు అమరుస్తుండగా స్తంభంపై నుంచి జారిపడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో బుధవారం జరిగింది. దసరా పండుగ కోసం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధిలైట్లు వేసేందుకు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన లంజపల్లి సైదులు లైట్లు వేసేందుకు కూలీగా వెళ్లాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, స్తంభం ఎక్కి లైట్లు వేసే క్రమంలో వ్యవసాయ విద్యుత్ లైన్ 3ఫేస్ ద్వారా వీధి లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో సైదులు విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి జారి సీసీరోడ్డు పై పడిపోయాడు. సైదులు తలకు తీవ్ర గాయమైంది. దీంతె 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

చౌటుప్పల్ రూరల్, తిప్పర్తి, అక్టోబరు 9: పెట్రోలింగ్ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఈ విషాదం నెలకొంది. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన పుట్ట యాదగిరి(54) తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. పెట్రోలింగ్ వాహనంలో వీఐపీలకు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి కేతేపల్లి మండలం నుంచి చౌటుప్పల్ మండలం పంతంగి వరకు పెట్రోలింగ్ వాహనంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు విధుల్లో ఉన్నారు. బుధవారం ఉదయం పంతంగి టోల్‌ప్లాజా వద్ద కాలకృత్యాలు తీర్చుకు నేందుకు వెళుతూ ఒక్కసారిగా కుప్పకూలారు. అక్కడేఉన్న సిబ్బంది వెంటనే సీపీఆర్ (హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య) చేసి చౌటుప్పల్‌లోని ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. యాదగిరికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.



యాదగిరి(ఫైల్)

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4.30వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 12.00నుంచి ఒంటి గంట వరకు,
మధ్యాహ్నం 1-4 వరకు సర్వ దర్శనాలు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.0గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
రాత్రి నివేదన: రాత్రి 9:30 గంటల నుంచి 9:45 వరకు
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 7 నుంచి 9 గంటల వరకు
తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..
భువనగిరి అర్బన్

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	220	250
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.134	200	224

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	588.80 అడుగులు
టీఎంసీలు	308.4658
ఎడమకాల్వకు నీటి విడుదల	9,067
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	26,187
సాగర్‌కు నీటి రాక	69,035
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	48,463 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	29,886
నీటి విడుదల	30,247

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.31
ప్రస్తుత నీటి మట్టం	644.40 అడుగులు
టీఎంసీలు	4.46
ఇన్‌ఫ్లో	1498.71 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1127.96 క్యూసెక్కులు

- కేతేపల్లి

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర, అక్టోబరు 9: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంప్ జవహర్ నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 8, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30వ చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8, 2025న నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో ఫారం నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష హిందీ, ఇంగ్లీషు మాధ్యమంలో ఉంటుందని, ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీషు, గణితం, సోషల్ సైన్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయని పేర్కొన్నారు.

నల్లబెల్లం స్వాధీనం

నూతన్‌కల్, అక్టోబరు 9: సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలోని బక్కహేమ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్సైజ్, సివిల్, పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి సారా, నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మహేంద్రనాథ్, ఎక్సైజ్ సీఐ రజిత తెలిపిన వివరాల ప్రకారం... బక్కహేమ్లతండాతో పాటు బద్యాతండా, బోటికిందితండాల్లో సారా తయారు చేస్తున్న వారిపై ఇళ్లపై బుధవారం దాడులు చేసి 20 కిలోల నల్లబెల్లం, 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 50లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు మూర్తి, జయప్రకాష్, సురేందర్‌బెనర్జీ పాల్గొన్నారు.



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

సరస్వతిదేవీగా దుర్గమ్మ



హుజూర్‌నగర్‌లో సరస్వతిదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



చిలుకూరులో నోట్లతో అలంకరించిన అమ్మవారి విగ్రహం, మండపం

మఠంపల్లి, అక్టోబరు 9 : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బుధవారం దుర్గామాత సరస్వతి దేవీ అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమించారు. మండలకేంద్రంలోని కనుకదుర్గ ఆలయంతో పాటు ఎస్సీకాలనీ, జామ్లాతండా, యాతవాకిళ్ల, పెదవీడు, మట్టపల్లి, అల్లీపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తి, లక్ష్మీనరసింహాశాస్త్రి, రామిశెట్టి అప్పరావు, సీతరామయ్య, రమేష్, శ్రీనివాసరావు, పోతురాజు, ఎంపీటీసీ లక్ష్మీభరత్‌నాయక్, రాజీవ్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో దుర్గమాత విగ్రహం వద్ద మహిళలు బుధవారం సామూహిక కుంకుమార్చన, యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

చిలుకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవార్లను లక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీతారాంనగర్, 25, 27వ వార్డులలో మహాచండీయాగం, కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తన్నీరు మల్లికార్జున్‌రావు, సంపత్‌రెడ్డి, కస్తాల శ్రావణ్, రంగాచార్యులు, కొండయ్య, అనంతలక్ష్మీ రాము, బిక్షం, రజని, యరగాని గురవయ్య, తేజానాయక్, తేజావత్‌రాజానాయక్, సరితారెడ్డి, వీరారెడ్డి, విజయవెంకటేశ్వర్లు, అట్లూరి మంజుల, చంద్రశేఖర్, బెల్లంకొండ శ్రీనివాస్, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారం : మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శీల కృష్ణమూర్తి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నూతన్‌కల్ : మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో దుర్గామాత విగ్రహం వద్ద తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల నాగలింగం, పసుల రవి, కమిటీ సభ్యులు వేణు, విక్రం, బబ్లూ, సుభాష్, సాయిసిద్ధార్థ, విజయ్, సాయి, లిఖిత్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్: అన్నదానం ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి, నాయకులు



అర్వపల్లిలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా చూడాలి

పెన్‌పహాడ్, అక్టోబరు 9 : గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్. ఈఈ పాండు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే సహాయకులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విద్యుత్ మోటారు, పైపులు, నీటి ట్యాంకులు ఎలాంటి మరమ్మతు ఉన్నా అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ డీవో వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సంజీవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్. ఏఈ శ్రీనివాస్, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: అవగాహన కల్పిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పాండు

మంచినీటి సహాయకులు సమర్థవంతంగా పనిచేయాలి

చిలుకూరు : మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో పనిచేసే మంచినీటి సహాయకులు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. చిలుకూరు, హుజూర్‌నగర్ మండలాల పరిధిలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచినీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సందర్భంగా క్షేత్రస్థాయిలో పనిచేసే విధానంపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ జగదీష్, ఏఈ నాగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాహసీల్దార్ కార్యాలయం తనిఖీ

నూతన్‌కల్, అక్టోబర్ 9 : మండల కేంద్రంలోని తాహసీల్దార్ కార్యాలయాన్ని సూర్యాపేట ఆర్‌డీవో వేణుమాధవ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో పండిన వరి కొనుగోలుకు గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో వారి ప్లాట్లను పరిశీలించాలన్నారు. ఆయన వెంట తాహసీల్దార్ శ్రీనివాస్ రావు, డీటీ వంశీరాజ్, ఆర్‌ఐలు ప్రసాద్, హసన్ తదితరులు ఉన్నారు.

దుకాణాల్లో చోరీ

గరిడేపల్లి, అక్టోబరు 9: మండల కేంద్రంలోని రెండు కిరాణ దుకాణాల్లో సోమవారం రాత్రి తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు.మండల కేంద్రానికి చెందిన శ్రీరంగం ప్రసాద్, రత్నాకర్ అన్నదమ్ములకు సంబంధించి కిరాణ, ఎలక్ట్రికల్ దుకాణాలు కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై పక్కపక్కనే ఉన్నాయి. రాత్రి ఎప్పటిలాగే దుకాణాలు మూసి వేసి ఇంటికి వెళ్లారు. తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం వెనుక భాగంలో గల పొలాల నుంచి గోడ దూకి తాళాలను పగులగొట్టి. కిరాణ, ఎలక్ట్రికల్ షాపుల్లోని సుమారు రూ.15 వేలు, రెండు కాటన్ల నూనె ప్యాకెట్లును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో స్థానిక ఎస్ఐ చలికంటి నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో ఆరుగురికి చోటు

నేరేడుచర్ల, అక్టోబరు 9: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో నేరేడుచర్ల మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మామిళ్ల శ్రీనివాసరెడ్డి, కట్టా శ్రీనివాసరెడ్డి, కందిమళ్ల సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రమావత్ దీప్లానాయక్, మన్నెం ఉమాపతి రెడ్డి, కార్యదర్శిగా జి. శ్రీనివాస్‌లు ఎంపికయ్యారు. వీరు ఎంపిక పట్ల పీఆర్టీయూ మండలాధ్యక్షుడు యడవెల్లి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాతంగి సైదులు, మాజీ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రమావత్ దీప్లానాయక్, చందమళ్ల వెంకన్న హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రభాకర్

హుజూర్‌నగర్, అక్టోబరు 9: హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మాతంగి ప్రభాకర్ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు పాధ్యా య సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఐద్వా జిల్లా కార్యవర్గం ఎన్నిక

సూర్యాపేట సిటీ, అక్టోబరు 9: : అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా తంగెళ్ల వెంకట చంద్ర (హుజూర్‌నగర్), మద్దెల జ్యోతి (సూర్యాపేట) ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవనంలో బుధవారం ఆ సంఘం సమా వేశం లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారితో పాటుగా మరో పదిమంది ఆఫీస్ బేరర్స్‌గా, 20 మంది జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

కాటమయ్య రక్షణ కవచాన్ని ఉపయోగించాలి

తిరుమలగిరి రూరల్, అక్టోబరు 9: గీత కార్మికులు కాటమయ్య రక్షణ కవచాన్ని (సేఫ్టీ కిట్) ఉపయోగించుకొని ప్రమాదాల బారి రక్షణ పొందాలని కాటమయ్య రక్షణ కవచ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తొండ గ్రామంలో గీత వృత్తి పనిదారులకు శిక్షణలో ఆయన మాట్లాడారు. గతంలో రక్షణ కవచం లేకపోవడం వల్ల అనేకమంది గీత కార్మికులు ప్రమాదాలకు గురై మరణించే వారని దీన్ని గమనించి ప్రభుత్వం గీత కార్మికులు ప్రమాదాల బారి నుంచి తప్పించేందుకు సేఫ్టీకిట్‌ను అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో వివిధ సొసైటీల అధ్యక్షులు కూనూరు నాగమల్లు, కొండ సోమ నర్సయ్య, చిత్తలూరి యాద గిరి, లోడె సత్తయ్య, అధికారులు రామయ్య, హెచ్‌డబ్ల్యూవో అంజయ్య, రజిత, జయప్రకాశ్ పాల్గొన్నారు.

చేగువేరా జీవితం నేటి యువతకు ఆదర్శం



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాస్ లైన్ నాయకులు

సూర్యాపేటటౌన్, అక్టోబరు 9 : విప్లవ వీరుడు చేగువేరా జీవితం నేటి యువతకు ఆదర్శమని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేగువేరా అంటే యూత్ ఐకాన్ అని, చైతన్య రూపమని, తిరుగుబాటు నినాదమని కొనియాడారు. చేగువేరా డాక్టరు అని, తన వృత్తిని వదిలి పేద ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, నర్సయ్య, పేర్లనాగయ్య, గులాం హుస్సేన్, మోహన్, శంకర్, విజయ్‌రెడ్డి, గౌరమ్మ పాల్గొన్నారు.

టీయూఎఫ్ కోఆర్డినేటర్‌గా మధు

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 9 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) దక్షిణ తెలంగాణ కోఆర్డినేటర్‌గా అనంతుల మధును ఎన్నుకున్నారు. మండలంలోని చందుపట్ల గ్రామంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడ్ని మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనారోగ్యాలకు గురవతున్న వారికి తెలంగాణ ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.

పెండింగ్ డీఏను మంజూరు చేయాలి : టీఎస్‌యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్.రాములు

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 9 : పెండింగ్‌లో ఉన్న డీఏను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసంఘం కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా కమిషన్ సిఫార్సులను వెంటనే పూర్తి చేయాలని తదనుగుణంగా రాష్ట్రంలో విద్యాపాలసీని అమలు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీసం బేసిక్ పే వర్తించేలా సిఫార్సు చేయాలని, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, యాకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అరుణభారతి, వెంకటయ్య, దామోదర్, నాగేశ్వర్‌రావు, రమేష్, లాలు, బాలసైదిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడిగా నరేష్

పెన్‌పహాడ్, అక్టోబరు 9 : బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నెమ్మాది నరేష్ నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేకు బుధవారం ఆయన నియామక పత్రం అందజేశారు.ఈసందర్భంగా నరేశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంకినేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



నరేష్

'ఎత్తిపోతల పథకాన్ని నిర్మించొద్దు'

హుజూర్‌నగర్, అక్టోబరు 9 : హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం వద్ద ఏర్పాటుచేయనున్న ఎత్తిపోతల పథకాన్ని నిర్మించవద్దని భూనిర్వాసితులు యర్రం లక్ష్మారెడ్డి, కందుల శ్రీనివాస్‌రెడ్డి, వర్రా వెంకటరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట భూనిర్వాసితులు ధర్నా చేసి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి ప త్రం అందించారు. వెల్లటూరు నుంచి హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం వరకు ముక్త్యాల బ్రాంచ్‌కెనాల్‌కు అనుసంధానంగా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు పెట్టారన్నారు. ఈ పథకం వల్ల తమ పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, మౌలాలి, వెంకటాచారి, ధనుంజయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, హనుమంతు, జాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చిరు వ్యాపారులను ఆదుకుంటాం'

హుజూర్‌నగర్, అక్టోబరు 9 : చిరు వ్యాపారులను అన్ని విధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ కార్మికుల సమావేశం నిర్వహించారు. చిరు వ్యాపారస్తులకు అండగా ఉండి వారికి ప్రభుత్వ పథకాలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాగేందర్, ముక్కంటి, లింగరాజు, వెంకటేశ్వర్లు, ఉస్మాన్, వెంకన్న, నాగమ్మ, రమణ పాల్గొన్నారు.

'తుంగతుర్తి' అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

అర్వపల్లి, అక్టోబరు 9: తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మందుల సామేల్ అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడంతో హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామ రుద్రమ్మ చెరువు పక్కన ఇండస్ట్రీయల్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించానని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



రామాపురంలో యువతకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీపీ సైదేశ్వరావు

మేళ్లచెర్వు, అక్టోబరు 9 : ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురంలో బుధవారం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువతకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉత్సవాల్లో డీజేలు, అశ్లీల, అల్లర్లకు చోటులేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉం డాలని, చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పరమేష్, మాజీ ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వరరావు, నాయకులు రంగిశెట్టి సైదయ్య, కొట్టె మాధవరావు, పఠాన్ వసూల్ పాల్గొన్నారు.

నాగారం: బతుకమ్మ, దసరాను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య కోరారు. మండల కే ంద్రంలో ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో శాంతి భద్రతలు ఎలాంటి విఘాతం కలిగిస్తేచర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామస్తులు కన్నెబోయిన వెంకటబిక్షం, మంగదుడ్ల దశరథ, చిప్పలపల్లి మల్సూర్, అనంతుల వెంకటయ్య, యల్లయ్య పాల్గొన్నారు.

వరద బాధితుల సర్వేపై విచారణ జరుపాలి

అనంతగిరి, అక్టోబర్ 9 : మండలంలోని గోండ్రియాల గ్రామంలో ఇటీవల వచ్చిన వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని గ్రామస్తులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిజమైన లబ్ధిదారులకు కాకుండా అనర్హులకు డబ్బు అందజేశారనివారు ఆరోపించారు. వరదల వల్ల ఇళ్లు మునిగిపోయి, ఇంట్లో వస్తువులు కొట్టుకుపోయి, కట్టుబట్టలతో మిగిలిన వారికి కనీస ఆర్థిక సాయం కూడా అందలేదన్నారు గ్రామ కార్యదర్శి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నిజమైన లబ్ధిదారులకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

సూర్యాపేటక్రైం, అక్టోబరు 9: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.సాయిరాం అన్నారు. బుధవారం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని పలు భారీ వాహనాలు అడ్డుకుని జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సూర్యాపేటలో భారీ వాహనాలు పట్టణంలోకి ఉదయం 9 గంటల తర్వాత అనుమతిలేదన్నారు.

మఠంపల్లి తీగల్ చెర్వును సంరక్షించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మఠంపల్లి, అక్టోబరు 9 : మండల కేంద్రంలో గల తీగల్ చెర్వు సంరక్షించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీటీసీ బుడిగ హుస్సేన్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌గౌడ్ మాట్లాడుతూ మఠం పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 561లో ఉన్న తీగల్ చెర్వు ఉందని, చెరువు శిఖం కొందరు కబ్జా చేసుకొని అక్రమ కట్టడాలు నిర్మించు కున్నారని తెలిపారు. ఈ ఆక్రమణపై గతంలో ఫిర్యాదు చేస్తే ఐబీ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారే తప్ప వాటిపై చర్యలు తీసుకోలేదన్నాడు. అనంతరం తహసీల్దార్ మంగారాథోడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇరిగిల వెంకటరెడ్డి, జానయ్య ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ



మంత్రి ఉత్తమ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కోదాడ రూరల్ : రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతి చెందడంతో మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తొండపు సతీష్, కాపుగల్లు సింగిల్ విండో చైర్మన్ సంబూరి సూర్యం, సింగిల్ విండో డైరెక్టర్ కమతం వెంకటయ్య, రెడ్లకుంట మాజీ సర్పంచ్ సాతినేని అప్పారావు, జేవీవీ జిల్లా కార్యదర్శి షేక్ ముక్బుల్, కోదాడ మాజీ ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య ఉన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

తుంగతుర్తి: బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొండగడుపుల నవీన్ అన్నారు. బుధవారం కాన్షీరాం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొండ గడుపుల ప్రశాంత్, ఉపాధ్యాయులు మల్లెపాక రవీందర్, మిట్ట గడుపుల రవి, కత్తుల నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

తుంగతుర్తిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

తుంగతుర్తి : తుంగతుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తుంగతుర్తి విద్య, వైద్యం, రవాణా రంగాల్లో వెనుకబాటుకు గురై అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తుంగతుర్తి తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొండలో శంకుస్థాపనకు సిద్ధమైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఉపసంహరించుకుని తుంగతుర్తిలో నిర్మించే విధంగా కృషి చేయాలని కోరారు.

నాగారం మండల వాసికి డాక్టరేట్

నాగారం : మండల కేంద్రానికి చెందిన కందుకూరి వందనకు మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీ ఆచార్యులు జి. ఉపేంద ర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏ స్టడీ ఆన్ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు మెడికల్ ప్రాక్టిషనర్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఆమెకు డాక్టరేట్ రావడం పట్ల బంధువులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శుభకాంక్షలు తెలిపారు.



వందన

సంపూర్ణ మద్యపాన నిషేధానికి సహకరించాలి

ఆత్మకూర్(ఎస్) : సంపూర్ణ మద్యపాన నిషేదం అమలుకు అధికారులు సహకరించాలని గట్టికల్ గ్రామ అఖిలపక్ష నాయకులు కోరారు. కలెక్టరేట్, జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో బుధవారం వారు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గ్రామంలో మద్యపానం వల్ల ఎందరో అనారోగ్యాల బారిన పడి మృతి చెందడమే కాకుండా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. మద్యపానం వల్ల ఘర్షణలు, వివాదాలు తలెత్తుతున్నాయని, అఖిలపక్షం ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా సమావేశం నిర్వహించి మద్యపానం నిషేధించాలని తీర్మానం చేసుకున్నామన్నారు. దసరా మరుసటి రోజు నుంచి గ్రామంలో ఎవరూ మద్యం విక్రయించిన, కొనుగోలు చేసిన జరిమానా విధించాలని తీర్మానం చేసుకున్నామన్నారు. అలాగే కల్తీ కల్లు తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసుకున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

చిలుకూరు : సాగులో రైతులు ఆధునిక పద్ధతిలో అవలంబించాలని మండల వ్యవసాయాధికారి శ్రీధర్ సూచించారు. మండల కేంద్రానికి చెందిన రైతు కొడారు లక్ష్మయ్య పొలం వద్ద డ్రోన్‌తో మందు పిచికారీ చేయడాన్ని పరిశీలించిన అనం త రం బుధవారం ఆయన మాట్లాడారు. డ్రోన్‌తో మందులను పిచికారీ చేయడం వల్ల సమయం ఆదా కావడమే కాక అనే క లాభాలున్నాయన్నారు. ఆయన వెంట రైతులు అల్సకాని వెంకటయ్య, సాతులూరి గురవయ్య, కొల్లు నాగయ్య, మంగ్యా తదితరులున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన

మేళ్లచెర్వు : మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఆరోగ్య ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి 100 ఏళ్ల అవుతున్న సందర్భంగా మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాత్తు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను స్థానిక ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విభాగ ప్రచారక్ మధుసూదన్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు బంగారు రుచిచారి, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

సూర్యాపేట సిటీ, అక్టోబరు 9 : ఆడపిల్లను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, ఎదగనిద్దాం అనే నినాదంతో బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడారు. అంతకుముందు బతుకమ్మలను ఒక్క దగ్గర ఉంచి బతుకమ్మ పాటలు పాడారు. కార్యక్రమంలో పిండిగా నాగమణి, కోట సృజన, కొప్పుల రజిత, ఆవుదొడ్డి భాగ్యమ్మ, ఎల్గూరి లక్ష్మీ, ఎల్లమ్మ, కవిత పాల్గొన్నారు.



నేరేడుచర్ల: పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకల్లో వైద్య సిబ్బంది

కోదాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో..

కోదాడ రూరల్ : కోదాడ ఆర్టీసీ డిపో నందు బుధవారం ఆర్టీసీ మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో వేడుకలు జరుపుకున్నారు.కార్యక్రమంలో డిపో మేనేజర్ హర్ష, అసిస్టెంట్ మేనేజర్ నాగశ్రీ, సూపరిండెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



సూర్యాపేటలో బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్న ఐద్వా కమిటీ సభ్యులు

పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో ..

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ సౌమ్యశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమీల, విజయ, కావేరి, జానమ్మ, ఉపేంద్ర, అరవింద, సాక్షి, స్వరూప, మంగమ్మ, ఆశావర్కర్లు బతుకమ్మలు ఆడుతూ పాటలు పడారు. అనంతరం సమీపంలోని చెర్వులో నిమజ్జనం చేశారు.